క్లుప్తంగా

రాజన్నదొర పరామర్శ



రేగు మహేశ్వరరావును పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుని ఇటీవల ఇంటికి చేరుకుని విశ్రాంతి తీసుకుంటున్న పలువురిని వైఎస్సార్‌సీపీ సాలూరు నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పరామర్శించారు. గిరిజన ఉద్యోగుల సంఘం న్యాయ సలహాదారు రేగు మహేశ్వరరావు, నాయకులు జర్జాపు శ్రీను, ఎం.శ్రీనివాసరావు, తదితరుల ఇళ్లకు మంగళవారం వెళ్లి వారిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, పలువురు కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా

సాలూరు: మున్సిపాలిటీ పరిధిలో బుధవారం నుంచి వారం రోజుల పాటు రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రధాన నీటి సరఫరా కేంద్రం వద్ద ప్రస్తుతం వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తున్నందున 4వ నంబరు ఇన్‌ఫిల్ట్రేషన్ బావిలో మోటారు పాడైనట్లు పేర్కొన్నారు. మోటారు మరమ్మతులు చేసేందుకు వారంరోజులు సమయం పడుతుందని, అంతవరకు రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. పట్టణ ప్రజలు ఈ విషయాన్ని గమనించి సిబ్బందికిసహకరించాలని కోరారు.

డిగ్రీ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం టౌన్: మూడవ దశ డిగ్రీ అడ్మిషన్లకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఈనెల 10 నుంచి 11 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 11 నుంచి 13 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. 11 నుంచి 14 వరకు వెబ్ ఆప్షన్లు ఉంటాయని తెలిపారు. 15న వెబ్ ఆప్షన్‌లలో మార్పులు చేర్పులు చేసుకునేందుకు వెసులుబాటు ఉంటుందన్నారు. 18న సీట్ల అలాట్‌మెంట్, 19 నుంచి 21లోగా విద్యార్థులు ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



గ్రామంలో మొక్కలు నాటుతున్న యువత

బలిజిపేట: మండలంలోని బర్లి గ్రామంలో శ్రీసిద్ధి వినాయక యూత్ కమిటీ సభ్యులు, సచివాలయ సిబ్బంది తమ సొంత నిధులతో గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామంలోని ఖాళీ స్థలాల్లో, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను గ్రామ యువత తీసుకున్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కల సంరక్షణ ఎంతో అవసరమని, దీన్ని ఒక విప్లవంలా కొనసాగించాలని వారు కోరారు.

సహస్ర దీపారాధన



వినాయకుని మండపం వద్ద దీపారాధన చేస్తున్న భక్తులు

బలిజిపేట: మండలంలోని వెంగాపురం గ్రామంలోని గంటవీధిలో ఏర్పాటుచేసిన బాల లక్ష్మీగణపతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సహస్ర దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో భక్తులు దీపాలు వెలిగించారు. అర్చకులు కె.గోపాలకృష్ణ, కె.ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి కుంకుమ పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

విదేశాల్లో పనిచేసేందుకు అవకాశం

గుమ్మలక్ష్మీపురం: విదేశాల్లో పనిచేసేందుకు ఈనెల 12న విశాఖపట్నంలోని కంచరపాలెం ప్రభుత్వ ఓల్డ్ ఐటీఐలో అర్హులను ఎంపిక చేస్తారని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో వెల్డర్, ఎలక్ట్రీషయన్, ఫిట్టర్, మోటర్ మెకానిక్, డీజిల్ మెకానిక్, ఆటో పెయింటర్ ట్రేడుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటు ఆయా ట్రేడ్‌లలో అనుభవం కలిగిన అభ్యర్థులు అర్హులుగా పేర్కొన్నారు. 150 మందికి విదేశాల్లో ఉద్యోగాలు కల్పించేందుకు అశోక్ లైలాండ్ కంపెనీ ముందుకొచ్చిందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

అయ్యో.. రైతన్నా..

- వర్షాలకు నీట మునిగిన పత్తి, ఇతర పంటలు
- తీవ్రంగా నష్టపోయిన రైతులు



పాచిపెంట సమీపంలో కుళ్లిపోయిన పత్తిపంటను చూపించి ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు

పాచిపెంట:

తుఫాన్ రైతులకు కన్నీరు మిగిల్చింది. చేతికందిన పత్తి, మొక్కజొన్న తదితర పంటలు నీట మునిగాయి. మండలంలో 3,200 ఎకరాల పత్తి పంట, 6000 ఎకరాల మొక్కజొన్న సాగులో ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వందలాది ఎకరాల్లో పంటలు నష్టపోయాయి. పత్తికాయలు తడిచి కుళ్లిపోయాయి. దూది తడిచిపోయి నేలరాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎకరా విస్తీర్ణంలో పత్తి సాగుకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడులు పెట్టామని, ఈ తుఫాన్ కారణంగా పంట పూర్తిగా పాడవడంతో పెట్టుబడి సొమ్ముతో పాటు మా శ్రమంతా నేలపాలయ్యిందని రైతులు వాపోతున్నారు. మరోవైపు మొక్కజొన్న పంట చాలావరకు నేలకొరిగింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టామని, లాభం మాట పక్కన పెడితే కనీసం పెట్టుబడి సొమ్ములు రాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా అయితే తెచ్చిన అప్పులకు వడ్డీలే కట్టలేమని వాపోతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



సీతానగరం: లక్ష్మీపురంలో నీటమునిగిన వరిచేనును పరిశీలిస్తున్న ఏఓ అవినాష్

నీటమునిగిన పంటల పరిశీలన

సీతానగరం: మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు పంట పొలాలు నీటమునిగాయి. మరికొద్ది రోజుల్లో పంటలు చేతికొస్తాయని ఆశగా ఎదురుచూసిన రైతులకు ఈ వర్షాలు నిరాశను మిగిల్చాయి. కాశీపేట, లక్ష్మీపురం, కామందొరవలస, చెల్లంనాయుడు వలస గ్రామాల్లో పాడైన పంటలను మండల వ్యవసాయశాఖ అధికారి ఎస్.అవినాష్ మంగళవారం పరిశీలించారు. నష్టపోయిన రైతుల వివరాలు సేకరించారు. నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేస్తున్నామని, నివేదికను ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి అందించి రైతులకు పరిహారం అందేలా చూస్తామన్నారు. నీట మునిగిన వరిపంటలో చేపట్టాల్సిన సస్యరక్షణపై రైతులకు సూచనలు చేశారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు చర్యలు తీసుకోండి

పార్వతీపురం టౌన్: విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి తులసీరాం డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ, కలెక్టరేట్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా తులసీరాం మాట్లాడుతూ.. గతంలో స్టీల్ ప్లాంట్‌లో 120 శాతం రేటింగ్ సామర్థ్యంతో ఉత్పత్తి జరిగేదని, ఇప్పుడు ముడిసరుకు ఇవ్వకపోవడంతో 50 శాతం ఉత్పత్తే జరుగుతోందన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు పూర్తిస్థాయిలో ముడిసరుకు సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయకుండా అడ్డుకోని ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, జిల్లా గ్రామికమహిళా సభ్యులు వి.ఇందిర, పట్టణ పౌర సంక్షేమ సంఘం సభ్యులు బి.సూరిబాబు, సంచాన ఉమామహేశ్వరరావు, సీఐటీయూ సభ్యులు బాలరాం, కృష్ణ, గిరిజన సంఘం నాయకులు రాము, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పండు, సీఐటీయూ సభ్యులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ పక్కాగా నిర్వహించాలి



పీడీలు, పీఈటీలకు సూచనలు చేస్తున్న ఎంఈఓ

బలిజిపేట: ఈ నెల 13 నుంచి నిర్వహించే మండల స్థాయి స్కూల్ గేమ్స్‌కు పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఎంఈఓ-1 సామల సింహాచలం సూచించారు. బలిజిపేట ఎంఆర్‌సీలో పీడీలు, పీఈటీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. బలిజిపేట ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 13న హైస్కూల్ విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, యోగా తదితర క్రీడా ఎంపికల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఆధునిక సాగు పద్ధతులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఏడీఏ ఆర్.శ్రీనివాస్

సీతానగరం: పంటల సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయశాఖ ఏడీఏలు ఆర్.శ్రీనివాస్, శారద సూచించారు. గుచ్చిమి రైతు భరోసా కేంద్రంలో ఏఓ ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏలు ఎరువుల వినియోగం, కలుపు నివారణ, నీటి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. క్రిమిసంహారక మందుల వినియోగంతో పంటపొలంలో ఉన్న మిత్రపురుగులు నశిస్తాయని, దీని వల్ల పంట దిగుబడిపై ప్రభావం పడుతుందన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులు దృష్టి సారించాలని కోరారు. ఆధునిక వ్యవసాయ విధానాలను అవలంభించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.శ్రీదేవి, ఉపసర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీ సీహెచ్ జగదీశ్వరరావు, బి.చిరంజీవులు, శ్రీనివాసరావు, గుచ్చిమి, సీతారాంపురం గ్రామాల రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో నిర్ణయాలొద్దు..

పాలకొండ రూరల్: సమస్యలు చుట్టుముడుతున్న క్రమంలో వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని నిలబడాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రేణుక అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కళాశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మానసిక ఆరోగ్య సంస్థ, స్థానిక ఏరియా ఆస్పత్రి సిబ్బంది సంయుక్తంగా విద్యార్థుల్లో మనోస్థైర్యం నింపేలా పలు సూచనలు చేశారు. సామాజిక కార్యకర్త కె.కృష్ణారావు తదితరులు మాట్లాడుతూ టెలీమానస్ టోల్‌ఫ్రీ నంబర్ 14416 వినియోగంపై అవగాహన కల్పించారు. యువత ఆదర్శవంతమైన జీవన విధానం వైపుగా అడుగులు వేయాలన్నారు.

నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన



సీతానగరం పీహెచ్‌సీలో నల్లబ్యాడ్జీతో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పావని

సీతానగరం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యుల సమస్యలు పరిష్కరించే వరకు నిరసనలు కొనసాగిస్తామని డాక్టర్ రాధాకాంత్, డాక్టర్ పావని, డాక్టర్ ఉషా స్పష్టం చేశారు. పెదంకలాం, సీతానగరం పీహెచ్‌సీల్లో విధులు నిర్వహించే వైద్యులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవో 85కి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. ఈ జీవో వల్ల గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో సేవలందించే వైద్యుల సర్వీసు నిరుపయోగంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జీవోలో మార్పులు చేయడం అన్యాయమని, దీని వల్ల వైద్యులు మనోవేదనకు గురవుతున్నారని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే ఈ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చేవరకు వైద్య సేవలకు ఆటంకం కలగకుండా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు.

కరకట్ట నిర్మించరూ..

కొమరాడ: మండలంలోని నాగావళి నది ముంపు ప్రాంతమైన కళ్లికోట గ్రామాన్ని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంగళవారం సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోకి వరదనీరు రాకుండా కరకట్ట నిర్మించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. నాగావళి నది ప్రవాహం పెరిగితే సుమారు 30 ఎకరాల్లో పంటలు పూర్తిగా నష్టపోతున్నామని వాపోయారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. సబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఆమె వెంట నాయకులు శనపతి ఉదయ్‌శేఖర్ పాత్రుడు, అధికారులు ఉన్నారు.

వెలుగు కార్యాలయంలో సౌకర్యాలు కల్పించాలి



ఎమ్మెల్యే జగదీశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న మండల సమాఖ్య సభ్యులు

గుమ్మలక్ష్మీపురం: వెలుగు కార్యాలయంలో సౌకర్యాలు కల్పించాలని గుమ్మలక్ష్మీపురం మండల సమాఖ్య అధ్యక్షులు కె.చిలకమ్మ, ప్రధాన కార్యదర్శి ఎస్.ఊర్వశి, కోశాధికారి జి.శోభారాణి తదితరులు కోరారు. ఈ మేరకు మంగళవారం గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని కలిసి వినతిపత్రం అందజేశారు. వెలుగు కార్యాలయంలో వచ్చిపోయే డ్వాక్రా మహిళల సౌకర్యార్థం మరుగుదొడ్లు నిర్మించాలని, కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు వరకు సీసీరోడ్డు నిర్మించాలని, రన్నింగ్ వాటర్‌తో పాటు తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

వరద బాధితుల కోసం రూ.20 వేలు విరాళం

విజయవాడలోని వరద బాధితులకు తనవంతు సాయంగా టీడీపీ అరకు పార్లమెంటు ఎస్టీ సెల్ కన్వీనర్ నందివాడ కృష్ణబాబు రూ.20 వేలు విరాళం అందించారు. గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని మంగళవారం కలిసి ఈ మొత్తాన్ని అందజేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు మండంగి భూషణరావు, కొండయ్య, గురాన శ్రీరామమూర్తి తదితరులున్నారు.

యోగాతో ఆరోగ్యం

పాలకొండ రూరల్: క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని యోగా శిక్షకుడు కె.జనార్దనరావు అన్నారు. స్థానిక యోగా కేంద్రంలో మంగళవారం ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత యాంత్రిక యుగంలో ప్రతి మనిషి ఒత్తిడి గురై అనారోగ్యం పాలవుతున్నారన్నారు. యోగాతో దీన్ని అధిగమించవచ్చన్నారు. సూర్య నమస్కారాల ఆవశ్యకత, తద్వారా లభించే ఫలితాలు వివరించారు.

భావోద్వేగాలను అదుపుచేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం

గుమ్మలక్ష్మీపురం: మనో నిబ్బరం కలిగి భావోద్వేగాలను అదుపుచేసుకొని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగడమే మానవ జీవిత సార్థకత అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం అన్నారు. ప్రపంచ 'ఆత్మహత్యల నివారణ దినం' సందర్భంగా మంగళవారం స్థానిక కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. చెడు ఆలోచనలు, పనుల వలన చెడు ఫలితాలే వస్తాయన్నారు. ఆ సమయంలో భావోద్వేగాలు అదుపుచేసుకోలేక ఆత్మహత్యల వైపు మనస్సు మళ్లుతుందని, అలాంటి ప్రమాదకర పరిస్థితులు రాకూడదనుకుంటే విద్యార్థులు స్థిరమైన లక్ష్యాలు కలిగి ఆచరణాత్మక ప్రణాళిక ఏర్పాటు చేసుకొని ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం ఐక్యూఏసీ కోఆర్డినేటర్ వి.కల్పన ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆత్మహత్య అనివార్యమా..? ఎందుకు..? అంశంపై వ్యాసరచన పోటీలతో పాటు భావోద్రేకాలను అదుపు చేయడమెలా? అనే అంశంపై గ్రూపు డిస్కర్షన్ ఏర్పాటు చేశారు.

దసరా ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ దసరా ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సూచించారు. అక్టోబర్ 3 నుంచి జరగనున్న అమ్మవారి దసరా ఉత్సవాల ఏర్పాట్లపై మంగళవారం ఆలయం ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకోవడం ద్వారా 9 రోజుల పాటు ఉత్సవాలు విజయంతంగా పూర్తి చేయాలన్నారు. ఇందుకోసం ప్రజల నుంచి సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు సూచించారు. సమావేశంలో ఈఓ మురళీకృష్ణ, ఎంపీపీ బి.భాను, సీఐ చంద్రమౌళి, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అసమర్థత వల్లే వరద కష్టాలు

- ప్రచార ఆర్భాటం, విరాళాల సేకరణపైనే చంద్రబాబు దృష్టంతా..
- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పార్వతీపురంటౌన్: విపత్తులు సంభవించినపుడు ప్రజల పక్షాన ఉండాల్సిన ప్రభుత్వ పెద్దలు వారి వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ప్రచార ఆర్భాటం చేస్తున్నారని, కేవలం విరాళాలపైనే దృష్టి సారించారని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు మండిపడ్డారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. విజయవాడ వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమయంలో ప్రతిపక్షం, అధికారుల సూచనలు పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. అయితే పాలకులు కేవలం ప్రతిపక్షంపై ఎదురుదాడి చేయడానికే శ్రద్ధ చూపుతున్నారు తప్ప సహాయ చర్యలను పట్టించు కోవడం లేదని ఆరోపించారు. భారీ వర్షాలతో విజయవాడకు చెందిన అన్నివర్గాల వారు అల్లాడి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన మీడియా, సోషల్ మీడియా, పలు స్వచ్ఛంద సంస్థల వద్ద బాధితులు తమ గోడు వెల్లబోసుకునే పరిస్థితి రావడం దారుణమన్నారు. వర్షాల వల్ల జరగనున్న ముప్పును అధికారులు ముందుగానే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ముందస్తు నష్ట నివారణ చర్యలు చేపట్టడంలో అలసత్వం వహించారని మండిపడ్డారు. బాధితులకు ఆహారం, మందులు అందివ్వడంతో పాటు సురక్షిత ప్రాంతాలకు తరలించడంలోనూ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇల్లు, కొంతమంది పెద్దల ఆస్తులను కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే బుడమేరు రిజర్వాయర్ నీటిని వెలగలేరు రెగ్యులేటర్‌కు వదిలేశారని ఆరోపించారు. వరదల వల్ల ఇప్పటివరకు సుమారు 60 మంది మరణించడం బాధాకరమన్నారు. జలదిగ్బంధంలో ఉన్న వారిని బోట్లు, పడవల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించలేకపోయారని మండిపడ్డారు. రాష్ట్ర రాజధానిగా చెప్పుకుంటున్న ప్రాంతంలో ఎనిమిది రోజుల పాటు ప్రజలు నరకయాతన అనుభవించారంటే ప్రభుత్వం ఎంత ఘోరంగా విఫలమైందో ప్రజలు అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు ప్రచార యావను మానుకుని బాధితులకు అండగా నిలవాలని కోరారు. గతంలో జగనన్న వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేయడంతో కరోనా వంటి మహమ్మారినే సమర్థవంతంగా ఎదుర్కోగలిగామని గుర్తుచేశారు.

కౌలురైతుల సమస్యలు పరిష్కరించండి



బలిజిపేట: కరపత్రాలను విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

బలిజిపేట: కౌలు రైతులకు కూటమి ప్రభుత్వం అందిస్తామన్న పెట్టుబడి సాయం రూ.20 వేలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. బలిజిపేట సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. కౌలురైతుకు పెట్టుబడి సాయంపై ఈ నెల 11, 12 తేదీల్లో గ్రామ సచివాలయాల వద్ద, 25, 26 తేదీల్లో తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కౌలురైతులకు ఇచ్చిన మాట ప్రకారం పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు మొహం చాటేస్తున్నాదని మండిపడ్డారు. మూడు నెలలు గడిచినా నేటికీ దీనిపై స్పందన లేదన్నారు. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

పిల్లల ప్రవర్తనను గమనించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

సాలూరు రూరల్: విద్యార్థులే భావిభారత పౌరులని రూరల్ సీఐ రామకృష్ణ అన్నారు. మండలంలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీఐ రామకృష్ణ మాట్లాడుతూ పిల్లల ప్రవర్తనపై తల్లితండ్రులు దృష్టి సారించాలని అన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు మానవతా విలువలను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్‌పర్సన్ కనకల రమణమ్మ, ఎస్సై నరసింహమూర్తి, సర్పంచ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గణనాథుని నిమజ్జనోత్సవం



గణనాథుని ఊరేగింపులో కోలాటం ఆడుతున్న మహిళలు

సీతానగరం: మండలంలోని పణుకుపేట, గుచ్చిమి, కృష్ణరాయపురం, ఇప్పలవలస గ్రామాల్లో గణనాథుని నిమజ్జనోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పణుకుపేటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీహరినాయుడు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు గణనాథుని విగ్రహాన్ని మేళతాళాలు, డాన్సులతో ఊరేగించారు. గుచ్చిమిలో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి లడ్డూ వేలం వేశారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ముని మన్మథరావు రూ.6 వేలకు లడ్డూను దక్కించుకున్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన



వంజరాపుగూడలో అంతరపంటలను పరిశీలిస్తున్న ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం షణ్ముఖరాజు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పి.ఆమిటి క్లస్టర్‌లో వంజరాపుగూడ, మండ, మొరమగూడ గ్రామాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న వరి, చిరుధాన్యాలు, పండ్లు, ఆకుకూరలు, దుంపజాతి పంటలను పార్వతీపురం మన్యం జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం పి.షణ్ముఖరాజు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను అభినందించారు. నీమాస్త్రం ఎరువుతో ప్రారంభ దశలో ఉన్న పంటలను పిచికారీ చేయడం వలన పంటను నాశనం చేసే తెగుళ్లు, పురుగుల నుంచి రక్షణ లభిస్తుందన్నారు. అలాగే దిగువ మండ గ్రామంలో జీడిమామిడి తోటల్లో సాగు చేసిన అంతరపంటలను పరిశీలించారు. సాగు విధానాలపై రైతులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలను అందివ్వాలని డీపీఎం సిబ్బందితో అన్నారు. ఆయన వెంట ఎంటీలు జి.నిర్మలాదేవి, గౌరి, ఎల్1 ప్రసాద్, ఎల్2 రవికుమార్ తదితరులున్నారు.